# సిగ్గు

అప్పుడు స్టూడియోలో 'ప్రతివ్రత' అనే చిత్రం షూటు అవుతూ వుంది. ఎండలు తీవ్రంగా ఉండటంవల్ల రాత్రి పూట షూటింగు....

గోపీ మేకప్‌రూం ముందు నుంచొని మురళి వేసుకున్న దుస్తులు, ధరించిన ఆభరణాలు సరిగ్గా వున్నవో లేవో చూస్తున్నాడు. డైరెక్టరు సెట్టుమీదనుంచి మేకప్ గదిలోకీ, మేకప్ గదిలోనుంచి ఆఫీసుగదిలోకీ, ఆర్డర్లిస్తూ తిరుగుతున్నాడు.

అంతా హడావిడిగా వుంది.

"ఊఁ..... కానివ్వండి" అన్నది మురళి.

గోపీ చదివి వినిపిస్తున్నాడు....

"నాలుగు గిల్టుగాజులు"

"ఊఁ _"

"చెవులకు పొడుగాటి లోలకులు"

"ఊఁ....." లోలకులు మెరసినవి,

"చెట్టు రెమ్మల లంగా"

"ఇదిగో"

"పువ్వుల జాకెట్టు"

ఆమె నవ్వాపుకోలేక పోయింది. "జాకెట్టుకొలతలు కూడా రాసుకోలేక పొయ్యారా!" అన్నది. గోపీ నవ్వి, ఆ రోజులూ వస్తవి. ఈ పుస్తకం పెన్సిల్‌తోపాటు టేపుకూడా తెచ్చుకుంటే సరిపోతుంది" అన్నాడు.

గోపీ ఆమెను సంభాషణలోకి దింపటానికి ప్రయత్నిచాడు....

"నరేగాని విన్న...."

డైరెక్టరు సెట్ మీదనుంచి "ఆర్టిస్టులు" అని కేకపెట్టాడు. స్టూడియో ప్రతిధ్వనించింది.

ఆమె గాభరాగా, "నేను వెళ్తాను. ఆలస్యమైతే కోపగిస్తారు" అని చెప్పి రివ్వున పరిగెత్తింది.

అతడుమాత్రం అలాగే నిలబడ్డాడు.

చెట్టు రెమ్మల లంగా కాళ్ళకు కొట్టుకుంటూ పరుగెత్తుకొని పోతున్న మురళిని చూస్తూ, 'అవును కోపగిస్తారు— మురళినికూడా కోపగిస్తారు.' అనుకొని నిట్టూర్చాడు.

గోపీకి సినిమా జీవితం కొత్త—

అదోగలిలో వచ్చిపడ్డాడు. అనుకున్నంత త్వరగా ఈ నాగరికతకు అలవాటుపడలేకపోయాడు. అందరినీ కొత్తగా చూసేవాడు—అందరూ విచిత్రంగా చూసేవారు ఎవ్వరూ అతనితో మాట్లాడేవారు కారు అందర్నీ అతడు—ఒక్క మురళిమాత్రం మొదట్నుంచీ అతనితో కుల్సాసాగా మాట్లాడు తుండేది. కిలకిల నవ్వేది; హాస్యం చేసేది; మెరసిపోయేది.

"మురళే లేకపోతే...."

ప్రొడక్షన్ మేనేజరు వచ్చాడు. అడిగాడు.

"మీరింకా ఇక్కడే వున్నారే?"

'ఆలోచిస్తున్నాను."

"మీ రట్లాగే చెప్తారు. అక్కడేమో ఆయన మమ్మల్ని గూటిస్తున్నాడు"

"ఎవరు డైరెక్టరుగారా?"

"ఇంకెవ్వరు!"

"పిలిచారా?"

"పిలవాలటండీ?"

గోపీ సెట్ మీదకు వెళ్ళాడు. షూటింగు ప్రారంభమైంది. డైరెక్టరు మురళితో 'ఇలా చెయ్యి, అలా చెయ్యి' అని చెపుతున్నాడు. కెమెరామన్ కేమెరాఅరేంజ్ చేస్తున్నాడు. సౌండు ఇంజనీయరు నాలుగైదు టెస్టులు తీసుకుని 'ఓ, కే' అని కేక వేశాడు.

గోపీ పోయి మురళిని చూస్తూ నిలబడ్డాడు.

డైరెక్టరు: "ఇప్పటిదాకా ఏంచేస్తున్నావ్!" డైరెక్టరు చుట్టూ ఉన్న అందరూ, గోపీ వంకకు చూశారు.

అతడు అలాగే మురళిని చూస్తూ "తరువాత మాట్లాండా." అన్నాడు డైరెక్టరుతో.

డైరెక్టరు క్రోధంగా చూశాడు_అవతలకు వెళ్ళాడు. గోపీ మురళితో జాలిగా "పాపం! నిన్న బాగా వడతగిలి వుంటుంది" అన్నాడు-నిన్న మండుటెండలో షూటింగు జరిగింది. మురళి ఆ ఎండలో తిరగటం గోపీ చూడలేక పోయాడు. కాని ఏంచేస్తాడు? చివరకు సందుచేసుకొని పైవిధంగా ప్రశ్నించాడు.

ఆమె క్లుప్తంగా జవాబు చెప్పింది:- "డైరెక్టరుగారి నడగండి." ఆమె నవ్వింది.

డైరెక్టరు వాళ్ళ సంభాషణ చూశాడు. గోపీవల్ల షూటింగు ఆలస్య మవటం తెలుసుకున్నాడు. "ఇవతలికిరా" అని కేక వేశాడు.

గోపీ హఠాత్తుగా డైరెక్టరువంక తిరిగి, "నిన్న మురళికి వడ తగిలింది" అన్నాడు.

అందరూ ఆశ్చర్యపడ్డారు. ఇంతవరకూ గోపీ ఎప్పుడూ ఆ విధంగా మాట్లాడి ఎరుగడు. అతని మాటలు అతనికే విచిత్రంగా ధ్వనించినవి డైరెక్టరు పిసుక్కున్నాడు—

మ్యూజిక్ డైరెక్టరు 'మాన్షియర్ ప్లవాలస్కీ— పోజ్' పెట్టి తయారుగా నిలబడ్డాడు—

మురళి, "మీరు కొంచెం దూరంగా ఉందురూ. ప్రక్కన వుంటే ఏమిటోగా ఉంటుంది" అన్నది.

గోపీ అవతలకి వెళ్ళాడు—

ఆ సీను షూటింగు పూర్తి అయింది. మురళి ఏవిధంగా నటించిందో అతనికి తెలియదు. అతడు చూశాడు. చూడలేదు. పాటవిన్నాడు. వినలేదు. డైరెక్టరు మాత్రం భుజం తట్టి "సెభాష్" అన్నాడు మురళిని.

ఒక్క పది నిమిషాలు ఆర్టిస్టులకు విశ్రాంతి ఇచ్చాడు—

మురళి మేకప్ గదిలోకి వెళ్ళటానికి సర్దుకుంటూ ఉంది. గోపీ ముందు బయల్దేరాడు. సెట్ దాటి బయటికి వచ్చేటప్పటికి అంతా చీకటి. అలాగే అడుగులు వేశాడు. అటు తిరుగుతూ, ఇటు తిరుగుతూ, ఆలోచిస్తున్నాడు—

"ఈ మురళే లేకపోతే నేనేమైపోయేవాణ్ని?— ఎందుకీ పిచ్చిపిల్లకు నేనంటే ఇంత ప్రేమ—నీరందరూ నిరాదరణ చూపిస్తున్నారని నామీద జాలా? నాలో ఈమె ప్రేమను కదిలించటానికి ఏముంది?"

అతని బుజాలమీద చేతులు పడ్డని— వెనక్కు తిరిగాడు— చెంపకు చెంప ఆనింది.

"ఇప్పటికి?" అన్నది.

పెదవులు కలిసివై!

"అమ్మయ్యో!" అన్నది.

పారిపోయింది.

గోపీకి అయోమయం— "ఎవరు?" అలాగే నిలబడి పోయాడు. ఎవరామె—? మొదట్లో తనమీద తనకే అలహ్యం వేసింది. ఎవరో తనిని ఎవరిగానో భ్రమపడి ఈ పని చేశారు! అతని క్రిందపెదవి చిమచిమలాడింది.

ఎవరు?

ఆలోచించాడు.

భానుమతి కాదు; నలభై సంవత్సరాలెక్కడివి?.... శ్యామలకాదు; బూరి బుగ్గలు—ఆ దాసీ అసలే కాదు—

మరి ఎవరీమే?

గోపీ అంతరాత్మ చెప్పింది- "ఇంకెవరు? మురళే!"

"—మురళి, నా మురళే!" అతని రక్తనాళాలు ఉప్పొంగినై. ఆ ముంగురులు-ఆ వేడి ఊర్పులు-మురళే! మైమరచాడు. చెంగున గంతు వేశాడు-ఈ మధ్య ఉదరం పెరిగిందనే సంగతికూడా మరచిపోయాడు-సెట్టుమీదకు పరిగెత్తాడు. అక్కడ మరొకసీను షూటింగు ప్రారంభం అయింది. మురళీ, మరికొందరు నటీమనులూ ఉన్నారు.

గోపీ కనుపించిన ప్రతివ్యక్తినీ కులాసాగా పలుకరించాడు. భానుమతిని చూచి, "నీకండ్లు చాలా బాగున్నవి." అన్నాడు-శ్యామలను చూచి "అద్భుతం" అన్నాడు-దాసీని చూచి చిటికవేశాడు- మురళితో "కండ్లు ఇలా తిప్పాలి సుమా!" అన్నాడు.

ఇదంతా డైరెక్టరు చూచాడు. గోపీ తరహా చూచి ఏమీ అనలేక మేనేజర్ని తిట్టాడు.

గోపీ అయిదు నిమిషాలు సుడిగుండంలా తిరిగాడు- కేమేరాకు అడ్డువచ్చాడు. సౌండు యింజనీయరుకు అడ్డువచ్చాడు. లైట్లుకు అడ్డు వచ్చాడు. గబగబా కెమేరా దగ్గరకువెళ్ళి "వ్యూఫైండర్లో" నుంచి తదేక ధ్యానంగా మురళిని చూస్తున్నాడు.

డైరెక్టర్ వూరుకోలేకపోయాడు, "కెమేరాచుట్టూ మూగవద్దు. అడ్డంతే" అని కేకవేశాడు.

గోపీ కదలకుండానే "క్లాప్" అన్నాడు—

ఆ సీనుకూడా షూటింగు పూర్తి అయింది. మురళి వస్తువులు సర్దుకుని గదిలోకి వెళ్తున్నది. గోపీ చూశాడు. తానూ బయల్దేరాడు.

డైరెక్టరు పిలిచారు.

గోపీ వినిపించుకోలేదు?

"గోపీ" గద్దించాడు డైరెక్టరు.

"ఉండవయ్యా!"

తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

అదే స్థలం! అదే చీకటి! మురళీ గబగబా తన గది వైపు వెళ్తున్నది.

బుజాలమీద చేతులు పడ్డది— వెనక్కి తిరిగింది, చెంపకు అనింది–పెదవులు కలిసినై.

ఒక్క క్షణం—

చటుక్కున చెంపమీద కొట్టింది.

డైరెక్టరు దగ్గరకు పరుగెత్తింది.

గోపీ స్తంభించిపోయాడు. గుటకలు మింగుతూ చెంపమీద చెయి పెట్టుకుని నిలబడిపోయాడు—ఆలోచించాడు— ఆలోచించాడు తన ఊరికి రైలెప్పుడు?

డైరెక్టరు, "గోపీ!" అని పిలిచాడు. అతడుపారిపోదామనుకున్నాడు డైరెక్టరు మళ్ళీ పిలిచాడు. ప్రొడక్షన్ మేనేజరు వచ్చాడు. "వారు అంత సేపట్నుంచీ పిలుస్తుంటే కదలేం?" అన్నాడు.

గోపీ నెమ్మదిగా బయల్దేరాడు

డైరెక్టరు పక్కనే కూర్చునివుంది మురళి. చుట్టూ టెక్నీషియన్లు కూర్చున్నారు. గోపీ కృతనిశ్చయుడై వెళ్ళాడు. డైరెక్టరు అతన్ని తేరిపార చూశాడు.

"ఈమెను ఇంటిదగ్గర దింపిరా!" అన్నాడు

గోపీ తికమక పడ్డాడు

డైరెక్టరు ప్రొడక్షన్ మేనేజర్‌తో "కారు పంపించు" అన్నాడు గోపీ మురళిని క్రీగంట చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. డైరెక్టర్ని చూశాడు. అతడు గోపీ అవస్థను గ్రహించినట్లుగా "ఈ పరిశ్రమలో సిగ్గు పడితే ఎట్లా!" అన్నాడు.

"అబ్బే, లేదండీ!" సర్దుకుంటూ జవాబు చెప్పాడు.

డైరెక్టర్ నవ్వాడు–

మురళి లేచింది–

కారు వచ్చింది–